సాక్షి నల్లగొండ

శనివారం । 28 । జూన్ । 2025



హత్యకేసులో నిందితుల అరెస్ట్

నకిరేకల్ మండలం నోములలో యువకుడి హత్య కేసులో ముగ్గురిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. - 8లో



ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా?

సోషల్ మీడియాలో ప్రశ్నిస్తే బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేస్తారా అని మాజీ ఎమ్మెల్యే లింగయ్య అన్నారు. - 8లో



రెండు కార్లు ఢీ..

రెండు కార్లు ఢీ కొనడంతో రాజాపేట ఏఎస్సైతోపాటు పలువురికి గాయాలయ్యాయి. - 8లో

న్యూస్‌రీల్

పదోన్నతితో బాధ్యత పెరుగుతుంది

• ఎస్పీ శరత్‌చంద్ర పవార్



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్‌ఐలు

నల్లగొండ : ఉద్యోగంలో పదోన్నతి పొందిన వారికి బాధ్యత కూడా పెరుగుతుందని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న ఆరుగురు ఏఎస్‌ఐలకు.. ఎస్‌ఐలుగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో వారికి ఎస్పీ.. స్టార్‌లు అందజేసి మాట్లాడారు. పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకం పెరిగే విధంగా పనిచేయాలని సూచించారు. క్రమశిక్షణ, బాధ్యతగా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు సంఘం అధ్యక్షుడు జయరాజు, పదోన్నతి పొందిన ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఉత్పత్తుల్లో నాణ్యత ఉండాలి



కుండల యూనిట్‌ను పరిశీలిస్తున్న పీడీ కోటేశ్వర్‌రావు

మిర్యాలగూడ టౌన్ : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ద్వారా బ్యాంకుల్లో రుణాలను తీసుకొని జీవనోపాధి పొందుతున్న మహిళలు తయారు చేసే ఉత్పత్తుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ కోటేశ్వర్‌రావు అన్నారు. మిర్యాలగూడలో పలు యూనిట్లను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఆయన వెంట మెప్మా టీఎంసీ పాతేపాక బక్కయ్య, సీఓ వెంకటేశ్వర్లు, సతీష్ తదితరులు ఉన్నారు.

కృత్రిమ గర్భధారణపై రైతులకు అవగాహన అవసరం



రికార్డులు తనిఖీ చేస్తున్న డాక్టర్ రమేష్

త్రిపురారం : పశువులకు కృత్రిమ గర్భధారణపై రైతులు అవగాహన పెంచుకోవాలని జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ జీవీ రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం త్రిపురారం పశువైద్యశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మట్లాడుతూ.. మండల వ్యాప్తంగా గ్రామాల్లో పర్యటించి కృషి కళ్యాణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పశువులకు ఉచితంగా ఎద సూదులను వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా కార్యాలయ సూపర్‌వైజర్ గీత, ఎండీ ఖాన్‌మోహమ్మద్, పశువైద్యులు నాగేందర్, శశికళ, పశుగణన సహాయకులు ఎండీ ఆసీమ్ హుస్సేన్, సిబ్బంది రాంకోటి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక



ఎంపికైన తేజు

హాలియా : నిజామాబాద్‌లో ఈనెల 28 నుంచి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు హాలియా పట్టణానికి చెందిన విద్యార్థి చింతలచెరువు తేజ ఎంపికైనట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొమ్మపాల గిరిబాబు తెలిపారు. ఈనెల 22న నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినయ్ అవుట్ డోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో విద్యార్థి చింతలచెరువు తేజు పాల్గొని ఉత్తమ ప్రతిభకనబర్చి రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థి తేజును ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు బండారు ప్రసాద్, ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ గట్ల అనంతరెడ్డి, జిల్లా ఫుట్‌బాల్ అసోసియషన్ కార్యదర్శి బొమ్మపాల గిరిబాబు, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

• స్వాగతం నాయకా..



నల్లగొండ పట్టణంలోని సెయింట్ అల్ఫోన్సెస్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థి నాయకత్వ ప్రమాణ స్వీకారోత్సవంలో భాగంగా విద్యార్థినుల నృత్య ప్రదర్శన

• వైజ్ఞానిక వీచిక




ఎంజీయూ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో భాగంగా విద్యార్థులు తయారు చేసిన సోలార్ పవర్ రిమోట్ కంట్రోల్ గ్రాస్ కట్టర్‌ను పరిశీలిస్తున్న వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల నుంచి దరఖాస్తు ఆహ్వానం

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ జిల్లాలో రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్, డీఆర్‌డీఏలో ఔట్‌సోర్సింగ్ సేవలు అందించేందుకు జిల్లా ఉపాధికల్పన కార్యాలయంలో ఎంపానల్ అయిన ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధికల్పన అధికారి పద్మ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రూ.500 దరఖాస్తు రుసుము చెల్లించి జూలై 5వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు ఉపాధికల్పన కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. కలెక్టర్ సమక్షంలో డ్రా పద్ధతిన ఏజెన్సీలను ఎంపిక చేస్తామని తెలిపారు.

అమాయకులే లక్ష్యంగా..
అప్పుల దందా!

• రూ.16 వరకు వడ్డీ చెల్లిస్తామని ఆశ చూపిన యువకుడు
• రూ.కోట్లు అప్పులు.. నెలనెలా వడ్డీ చెల్లింపు
• ఫార్చునర్ కార్లు, విల్లాల్లో విలాసవంతమైన జీవనం
• అసలు చెల్లించకుండా వడ్డీ ఇస్తూ కాలయాపన
• ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు.. రంగంలోకి దిగిన పోలీసులు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : అతనో పాతికేళ్ల యువకుడు. పీఏపల్లి మండలంలోని పలుగుతండా గ్రామం. ఏం పని చేస్తాడో ఎవరికీ తెలియదు. కానీ ఖరీదైన కార్లలో తిరుగుతున్నాడు. అమాయక ప్రజలందరిని అధిక వడ్డీ ఆశ చూపి నమ్మించాడు. రూ.10 నుంచి రూ.16 వరకు వడ్డీ ఇస్తానని నమ్మబలికి రూ.కోట్లు అప్పు చేశాడు. ముందుగా బంధువుల వద్ద అప్పులు తీసుకున్నాడు. ప్రతీనెల వడ్డీ చెల్లించాడు. ఇంకేముందీ అధిక వడ్డీకి ఆశపడి వేల మంది వారి ఇళ్లు, భూములు బ్యాంకుల్లో తనఖా పెట్టి మరీ అతనికి అప్పులు ఇచ్చారు. తమ గ్రామంతోపాటు ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలోని అనేక మండలాలకు చెందిన వారి నుంచి అతను అప్పులు తీసుకున్నాడు. వడ్డీ చెల్లిస్తున్నా.. అసలు మాత్రం ఇవ్వడం లేదు. నాలుగేళ్ల కిందట మొదలైన ఈ దందాలో మొదట్లో అప్పులు ఇచ్చిన వారికి ఇప్పటి వరకు అసలు ఇవ్వకపోవడంతో విషయం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసే వరకు వెళ్లింది.

15 మంది ఏజెంట్లను పెట్టుకొని మరీ అప్పులు

సదరు యువకుడు మొదట్లో తనతోపాటు ఒకరిద్దరిని మాత్రమే కలుపుకొని అధిక వడ్డీ పేరుతో అప్పుల దందా ప్రారంభించారు. ఆ తరువాత 15 మంది ఏజెంట్లను నియమించుకున్నాడు. వారంతా గ్రామాల్లో తిరుగుతూ తమకు తెలిసిన వారు, వారి బంధువులను మాటల్లో పెట్టి అధిక వడ్డీ ఇస్తామని నమ్మబలుకుతారు. అంతేకాదు ముందుగా మాట్లాడుకున్న ప్రకారం రూ.10 నుంచి రూ.16 వడ్డీ కూడా చెల్లిస్తారు. ఇలా దేవరకొండ, నల్లగొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్ ప్రాంతాల్లో అప్పు ఇచ్చే వారిని బట్టి రూ.5 లక్షల నుంచి మొదలుకొని రూ.10 కోట్ల వరకు వసూలు చేశాడు. అంతేకాదు రంగారెడ్డి జిల్లాలోనూ అధిక వడ్డీ ఆశ చూపి పెద్ద ఎత్తున అప్పులు చేశాడు. 16 బ్యాంకు అకౌంట్ల ద్వారా ఈ దందాకు కొనసాగిస్తున్నట్లు తెలిసింది. రోజురోజుకు కొత్త వ్యక్తుల వద్ద అప్పులు చేస్తూ పాత అప్పులకు వడ్డీలు చెల్లిస్తూ దందా కొనసాగిస్తున్నట్లు తెలిసింది.

వ్యక్తిగతంగా ఫిర్యాదుకు ముందుకు రాని ప్రజలు

పోలీసుల విచారణలో యువకుడు, తన ఏజెంట్లు అధిక వడ్డీ ఆశ చూపి పెద్ద ఎత్తున అప్పులు తీసుకున్నట్లు తేలింది. దీంతో మిర్యాలగూడ, దేవరకొండ ప్రాంతాల్లోని గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు, ఇతర ప్రజా ప్రతినిధులు, అప్పులు ఇచ్చిన ప్రజలను పోలీసులు పిలిపించి విచారించారు. అయితే వారిపై ప్రజలు ఎవరూ వ్యక్తిగతంగా ఫిర్యాదు చేసేందుకు ముందుకు రాలేదు. తాము ఫిర్యాదు చేస్తే.. డబ్బులు తమకు తిరిగి రావన్న భయంతో వ్యక్తిగతంగా ఫిర్యాదు చేయలేదు. పోనీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారైనా వచ్చి తమకు వ్యక్తిగతంగా ఫిర్యాదు చేయాలని కోరినా ఎవరూ ముందుకు రాలేదని పోలీసులు చెబుతున్నారు. దీంతో మూడు నెలల్లో అతను చేసిన అప్పులు వడ్డీతో సహా చెల్లించాలని, కొత్త అప్పులు చేయవద్దని, కొత్త అప్పులు చేస్తే కేసులు నమోదు చేస్తామని కౌన్సెలింగ్ ఇచ్చి అతన్ని పంపించివేసినట్లు తెలిసింది.

బయటకొచ్చిందిలా..

పీఏపల్లి మండలంలోని వద్దిపట్లలో సైబర్ నేరాలు, మార్కెటింగ్ మోసాలు, అధిక వడ్డీ మోసాలపై పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. దీంతో తమ వద్ద అప్పు తీసుకున్న యువకుడి వ్యవహారం తమ కళ్ల ముందు మెదిలింది. తమ డబ్బులు వస్తాయా? లేదా? అన్న ఆందోళన వారిలో మొదలైంది. అయితే వ్యక్తిగతంగా ఎవరూ పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. మొదట్లో అప్పులు ఇచ్చిన వారికి అసలు ఇంతవరకు ఇవ్వకపోడంతో విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. మరోవైపు దేవరకొండ ప్రాంత పబ్లిక్ ఫ్రాడ్ అవేర్‌నెస్ గ్రూపు పేరుతో కలెక్టర్ ఇలా త్రిపాఠికి ఈనెల 16వ తేదీన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో అమాయకుల నుంచి అధిక వడ్డీ ఆశ చూపి రూ.కోట్లు అప్పులు చేశారని, భారీ స్కామ్‌కు తెర లేపారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. కలెక్టర్ ఆ ఫిర్యాదును ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌కు పంపించారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు. వెంటనే డబ్బులు వసూలు చేసిన ఆ యువకుడు, ఏజెంట్లను అదుపులోకి తీసుకొని విచారించారు.

అధిక వడ్డీకి ఆశ పడొద్దు

ప్రజలు అధిక వడ్డీకి ఆశ పడొద్దు. ఆస్తులు తనఖా పెట్టి అప్పులు ఇస్తే తీవ్రంగా నష్టపోయే పరిస్థితి వస్తుంది. ముందుగా వడ్డీ వచ్చినా, అసలు రాకపోతే ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అతనికి కొత్త అప్పులు లభించకపోతే, ముందుగా అప్పులు ఇచ్చిన వారు అసలును కోల్పోవాల్సి వస్తుంది. అందుకే అధిక వడ్డీకి ఆశపడి మోసపోవద్దు.

– శరత్‌చంద్ర పవార్, ఎస్పీ

డ్రైమిషన్‌పై అవగాహన కల్పించాలి

• కలెక్టర్ ఇలా త్రిపాఠి
• తిప్పర్తి మార్కెట్ యార్డ్‌లో నూతన యంత్రం పరిశీలన



యంత్రాన్ని పరిశీలించి మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

తిప్పర్తి : రైతులు డ్రైమిషన్‌ను వాడుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం తిప్పర్తి మార్కెట్ యార్డ్‌లో నూతన టెక్నాలజీతో తయారు చేసిన ధాన్యం డ్రై మిషన్‌ను ఆమె పరిశీలించారు. యంత్రం పనితీరు, ప్రయోజనాలను ఇబ్బందులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వచ్చే సీజన్ నాటికి రైతులకు ఉపయోగపడే విధంగా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరి కోతల సీజన్‌లో రైతులు ఎక్కువగా తేమ సమస్యను ఎదుర్కొంటున్నారని.. ఈ సమస్యను అధిగమించడానికి ప్రభుత్వం డ్రై మిషన్లు ఇస్తోందన్నారు. జిల్లాకు రెండు యంత్రాలు వచ్చాయని.. వాటిని మిర్యాలగూడ, తిప్పర్తి మార్కెట్ యార్డుల్లో ఉంచామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, తహసీల్దార్ పరుశురాం, ఎంపీడీఓ వెంటేశ్వర్‌రెడ్డి, ఏఓ సన్నిరాజు, ఎంపీఓ జానయ్య, ముత్తినేని శ్యాంసుందర్ ఉన్నారు.

చెరువులు ఆక్రమిస్తే కేసులే..

నల్లగొండ : చెరువులు, కుంటల ఆక్రమణకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. చెరువులు, కుంటల ఆక్రమణపై శుక్రవారం ఆమె కలెక్టరేట్‌లో ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు, తహసీల్దార్లతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో జరిగిన ఆక్రమణలను తొలగించాలని, కొత్తగా ఆక్రమణలు జరగకుండా చూడాలన్నారు. అన్ని లే ఔట్లు, పర్మిషన్లను నీటిపారుదల శాఖ పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాతే ఇవ్వాలని ఆదేశించారు. నిర్మాణాల అనుమతి సమయంలో ఇరిగేషన్ శాఖ నుంచి 'నో అబ్జెక్షన్' సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకునే విధంగా చూడాలన్నారు. మిర్యాలగూడ డివిజన్లో ఇరిగేషన్ చెరువులకు సంబంధించి సర్వేను త్వరితగతిని పూర్తి చేసి మోడల్ డివిజన్‌గా తయారు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, జిల్లా ఇరిగేషన్ అధికారి పర్వతీశ్వరరావు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ సుజాత తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యాంశాలపై పట్టు సాధించాలి



విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కనగల్ : విద్యార్థులు పాఠ్యాంశాలపై పట్టు సాధించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం కనగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆమె సందర్శించారు. మొదటి సంవత్సరం సీఈసీ తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఎకనామిక్స్ సబ్జెక్టుపై ఆమె విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అంతకుముందు కనగల్ వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌ను సందర్శించి మార్కెట్ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులకు సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేసి పంపించాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఎం హరీష్, మార్కెట్‌శాఖ ఏడీ ఛాయదేవి, మార్కెటింగ్ సెక్రటరీ శ్రీధర్‌రాజు తహసీల్దార్ పద్మ, ఏఓ అమరేందర్, మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎల్‌బీసీ పనులు పరిశీలన



ఎస్ఎల్‌బీసీ టన్నెల్-1 వద్ద ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ శివకుమార్‌నాయుడు, అధికారులు

చందంపేట : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని మన్నెవారిపల్లిలోని ఎస్ఎల్‌బీసీ టన్నెల్ -1 పనులను శుక్రవారం ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివకుమార్‌నాయుడు పరిశీలించారు. అనంతరం చందంపేట మండలంలోని నక్కలగండితండా వద్ద చేపడుతున్న నక్కలగండి కట్ట నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఆయన వెంట నాగర్‌కర్నూల్ అడిషనల్ కలెక్టర్ అమరేందర్, దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, తహసీల్దార్ శ్రీధర్‌బాబు, ఇరిగేషన్ శాఖ అధికారులు ఉన్నారు.

కలెక్టరేట్‌లో సమీక్ష

నల్లగొండ : రాష్ట్ర ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ శివకుమార్‌నాయుడు శుక్రవారం జిల్లాకు వచ్చారు. నల్లగొండలోని కలెక్టరేట్‌లో జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల ఆర్ అండ్ ఆర్ పనులపై సమీక్షించారు. అంతకుముందు ఆయనకు కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, స్పెషల్ కలెక్టర్ సీతారామారావు బొకే ఇచ్చి స్వాగతం పలికారు.

మెడికల్ కళాశాలల మానిటరింగ్ కమిటీ ఏర్పాటు



మానిటరింగ్ కమిటీలో చర్చిస్తున్న కలెక్టర్, డీఎంఈ సభ్యులు

సూర్యాపేటటౌన్ : జాతీయ మెడికల్ కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రతి మూడు మెడికల్ కళాశాలలకు కలిపి ఒక మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. అంతకు ముందు డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ బృందం సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని తనిఖీ చేసింది. ఈ సందర్భంగా సూర్యాపేటలోని మెడికల్ కళాశాలలో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, డీఎంఈ సభ్యులతో సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో డీఎంఈ మెంబర్ నాగేందర్, కళాశాల ప్రిన్సిపాల్ జయలత, ఆస్పత్రి సూపరిటెండెంట్ సత్యనారాయణ, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో పోటీపడేలా..

• పల్లెల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాలపై సర్వే
• ఎంపిక చేసిన గ్రామాలను పరిశీలించనున్న కేంద్ర బృందాలు
• మెరుగైన ర్యాంకు సాధించిన పల్లెలకు అవార్డులు
• పంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్న అధికారులు



నల్లగొండ : గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా కేంద్రం ప్రణాళిక రచిస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే గ్రామాల్లో నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాలను పరిశీలించనుంది. ఎంపిక చేసిన గ్రామాలను త్వరలో కేంద్ర బృందం పరిశీలించి.. చెత్త సేకరణ తీరు, పారిశుద్ధ్య సిబ్బంది చెత్త తర లింపు, ప్రభుత్వ సంస్థల పనితీరు తదితర అంశాలపై నేరుగా ప్రజలతో మాట్లాడి వివరాలు సేకరించనునంది. అంశాల వారీగా మార్కులు వేయనుంది. మెరుగైన మార్కులు పొందిన గ్రామాలకు అవార్డులు ఇవ్వనుంది. దీంతో గ్రామాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఏర్పడి అభివృద్ధి చెందుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని పంచాయతీలు మెరుగైన ర్యాంకు సాధించేలా అధికారులు ఆయా గ్రామ పంచాయతీల సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

గ్రామాలన్నీ పారిశుభ్రంగా ఉండాలన్న ఉద్దేశంతో కేంద్ర స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఆ కార్యక్రమ పనితీరును తెలుసుకునేందుకు సర్వే నిర్వహించనుంది. కేంద్రం ఆధ్వర్యంలో అకాడమి ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ అనే సంస్థ నుంచి ఇద్దరు ప్రతినిధులు జిల్లాకు రానున్నారు. వారు ప్రధానంగా గ్రామాల్లో చెత్త సేకరణ తీరు, ప్రభుత్వ సంస్థల పనితీరు, వ్యర్థాల నిర్వాహణ, సెగ్రిగేషన్ షెడ్డులో ఎరువుల తయారి, ప్లాస్టిక్ వినియోగం, ఇంకుడు గుంతల నిర్మాణం, శుద్ధమైన తాగునీటి సరఫరా, పచ్చదనం, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, బహిరంగ ప్రదేశాల్లో పారిశుద్ధ్యం పరిస్థితి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కార్యక్రమాల అమలు, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని మార్కులు కేటాయిస్తూ సర్వే చేయనున్నారు. మెరుగైన ర్యాంకు సాధిస్తే అవార్డు ఇవ్వనున్నారు.

స్వచ్ఛత పనులపై ఆరా తీస్తుంది

జూలై మాసంలో కేంద్ర బృందం జిల్లాలో పర్యటించే అవకాశం ఉంది. ఎంపిక చేసిన గ్రామాల్లో స్వచ్ఛత పనులు ఏవిధంగా నిర్వహిస్తున్నారో ఆరా తీసి మార్కులు వేసి ప్రభుత్వానికి పంపుతుంది. ఎక్కువ మార్కులు వచ్చిన గ్రామాలకు కేంద్ర ప్రభుత్వం పురస్కారాలు అందించనుంది.

– శేఖర్‌రెడ్డి, డీఆర్‌డీఓ

మార్కుల కేటాయింపు ఇలా..

కేటగిరీ	మార్కులు
సర్వీస్ లెవల్ ప్రోగ్రెస్	240
ప్లాంట్ల పరిశీలన	120
స్వచ్ఛతస్థితి నేరుగా పరిశీలన	540
పౌరుల అభిప్రాయాలు	100
మొత్తం	1000

ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే..

సచ్ఛసర్వేక్షణ్‌లో బాగంగా కేంద్రం చేపట్టిన అభివృద్ధిపై సిటిజన్‌పోల్ యాప్ ద్వారా ప్రజల అభిప్రాయాను స్వీకరిస్తారు. గ్రామాల్లో చేపట్టే పనులు, ఇతర అంశాలపై సర్వే నిర్వహిస్తారు. అయితే కేంద్ర బృందం మాత్రం ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే చేస్తుంది. గ్రామాలను కేంద్ర బృందం ఎంపిక చేసుకుని.. జిల్లా అధికారులకు ఏరోజు వస్తున్నారో చెబుతారు. జిల్లాలో 869 గ్రామ పంచాయతీలు ఉండగా.. 20 గ్రామాల్లో కేంద్ర బృందం సర్వే నిర్వహించనుంది. ఆయా గ్రామాల్లోని 16 నివాస గృహాలను సందర్శించి వారి అభిప్రాయాలను క్రోడీకరించి పరిశీలిస్తారు. 16 నివాసాల్లో మూడు ఎస్సీ, మూడు ఎస్టీ, ఎనిమిది ఇతర కుటుంబాలు, మరో రెండు నివాసాలు అధికారుల నిర్ణయం మేరకు ఎంచుకుంటారు. ఈ విధంగా దాదాపు నెల రోజుల పాటు సర్వే కొనసాగుతుంది. అనంతరం కేంద్రానికి నివేదిక అందజేస్తారు. దాని ఆధారంగా జిల్లాకు స్కోర్, ర్యాంకు ప్రకటిస్తారు. జిల్లాకు మెరుగైన ర్యాంకులు రావాలనే ఉద్దేశంతో క్షేత్ర స్థాయి అధికారులకు జిల్లా కలెక్టర్ ఇటీవల సమావేశం సైతం నిర్వహించారు.

మహిళా సంఘాలు బలోపేతం కావాలి



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

కనగల్ : మహిళ సంఘాలు బలోపేతం కావాలని డీఆర్‌డీఓ శేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కనగల్ మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. బ్యాంకు రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించే సంఘాలకు గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీపీఎం రామలింగయ్య, ఏపీఎం సంకు హరి, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

తిప్పర్తి: విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన తిప్పర్తి మండలంలోని రామలింగాలగూడెం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వనపర్తి అంజయ్య(47) ఇంట్లో ఉన్న నీటి సంపులో నుంచి నీరు పారుతుండగా అందులోకి దిగి పైపు తగిలిస్తున్నాడు. ఈక్రమంలో అందులో ఉన్న మోటార్‌కు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడి భార్య వినోద ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

యాదగిరిగుట్ట రూరల్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం నమాత్‌పల్లి గ్రామానికి చెందిన కంబాలపల్లి సాయికిరణ్ (25) పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడి భార్య గర్భిణి కావడంతో గురువారం ఉదయం ఆమెను భువనగిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యపరీక్షలు చేయించాడు. అనంతరం భార్యను ఆమె తల్లిగారి ఊరైన తుర్కపల్లి మండలంలోని వెంకటాపురానికి పంపించాడు. సాయి కిరణ్ అదే రోజు సాయంత్రం ఆస్పత్రిలోని తన భార్య వైద్య పరీక్షల రిపోర్టులను తీసుకుని వెంకటాపురానికి బయల్దేరాడు. శుక్రవారం మల్లాపురం గ్రామ శివారులో వ్యక్తి మృతి చెంది ఉన్నాడని సమాచారం అందుకున్న పోలీసులు, ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. బైక్‌పై యాదగిరిగుట్ట నుంచి వెంకటాపురానికి వెళ్తుండగా అదుపు తప్పి రోడ్డు పక్కన పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెంది ఉంటాడని భావించారు. మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉదయ్ తెలిపారు.

జూదరుల అరెస్టు

హాలియా : జూదం ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. హాలియా ఎస్‌ఐ సాయి ప్రశాంత్ వివరాల ప్రకారం.. అనుముల మండలం పాలెం గ్రామ శివారులోని డంపింగ్ యార్డు ప్రాంతంలో జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో శుక్రవారం తనిఖీ చేశారు. ఏడుగురు పట్టుబడగా మరో ముగ్గురు అక్కడి నుంచి పరారయ్యారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వినూత్న ఆవిష్కరణలు

ఎంజీయూలో వైజ్ఞానిక ప్రదర్శన

- ప్రాజెక్టులను ప్రదర్శించిన ఇంజినీరింగ్ విద్యార్థులు
- దేశానికి మేటి ఇంజినీర్లను అందిస్తాం
- యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్



సర్టిఫికెట్లు అందుకున్న ఇంజినీరింగ్ విద్యార్థులు

నల్లగొండ టూటౌన్: మహాత్మా గాంధీ యూనివర్సిటీలో శుక్రవారం ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో వైజ్ఞానిక ఆవిష్కరణల ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నైపుణ్యాలు, కొత్త ఆవిష్కరణలతో దేశానికి మేటి ఇంజనీర్లను అందిస్తామని తెలిపారు. అధ్యాపకుల ప్రోత్సాహంతో విద్యార్థులు చేసిన ఆవిష్కరణలు వారి సామాజిక స్పృహకు అద్దం పట్టాయన్నారు. ఎంజీ యూనివర్సిటీ ప్రాంగణంలో కాలుష్యం లేని వాహనం కోసం వెతుకులాడే ప్రయత్నంలో భాగంగానే ఇంజనీరింగ్ విద్యార్థులు, అధ్యాపకులు తామే రూపొందిస్తామని ముందుకు వచ్చినట్లు తెలిపారు. యూనివర్సిటీ అందించిన రూ.3.50 లక్షల ఆర్థిక సహకారంతో 8 మంది సామర్థ్యం గల సోలార్ క్యాంపస్ కార్ట్‌ను రూపొందించడం అభినందనీయమన్నారు. నాలుగు గంటల పూర్తి చార్జింగ్‌తో 90 కిలో మీటర్ల వరకు ప్రయాణించవచ్చని తెలిపారు. అధునాతన వాహనాల్లో ఉండే అన్ని సదుపాయాలను ఈ వాహనంలో కల్పించడం గొప్ప విషయమన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఆవిష్కరణలను యూనివర్సిటీ ప్రోత్సహిస్తుందని చెప్పారు. ఆటోమెటిక్ ఫ్లోర్ క్లీనర్, వాయిస్ కంట్రోల్ స్మార్ట్ డస్ట్ బిన్, ఫొటో గ్రాఫిక్ క్లాక్, వీసీఆర్ బేస్డ్ రిఫ్రిజిరేటర్, ఎమర్జెన్సీ అలర్ట్ సిస్టం, ఎస్ప్రెస్ కాపీ మెషిన్, ఎలక్ట్రిక్ స్కూటర్, సోలార్ గ్రాస్ కట్టర్, అంబులెన్స్ డ్రైవర్స్‌కు ఉపయోగించే సిగ్నలింగ్, సాఫ్ట్‌వేర్ తదితర ప్రాజెక్టులను విద్యార్థులు ఆవిష్కరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి, ఆకుల రవి, డీన్ రేఖ, మానిక, అవినాష్, జయంతి, నాగరాజు, మారేశ్వర్‌రావు, జ్యోతిరాణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



వాయిస్ కంట్రోల్ స్మార్ట్ డస్ట్ బిన్



డ్రోన్ కెమెరాను పరిశీలిస్తున్న వైస్ ఛాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్



విద్యార్థులు రూపొందించిన ఎలక్ట్రిక్ స్కూటర్

భూ వివాదం కేసులో ఎస్సై చేయిచేసుకున్నాడు

- చండూరు మండలం తాస్కానిగూడేనికి చెందిన ఆవుల వెంకన్న ఆరోపణ

చండూరు: భూ వివాదంలో కేసులో ఎస్సై తనపై దుర్భాషలాడడంతోపాటు, చేయి చేసుకున్నాడని చండూరు మండలంలోని తాస్కానిగూడెం గ్రామానికి చెందిన ఆవుల వెంకన్న వాపోయాడు. వివరాలిలా ఉన్నాయి. తాస్కానిగూడెం గ్రామానికి చెందిన ఆవుల వెంకన్నకు, అతడి బాబాయి ఆవుల అంజయ్యతో వ్యవసాయ భూమికి సంబంధించి హద్దుల గొడవలు ఉన్నాయి. గత నెలలో ఆవుల అంజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఊరిలో పెద్ద మనుషుల సమక్షంలో చర్చలు జరిపారు. గురువారం వారిని ఎస్సై వెంకన్న పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఫిర్యాదు విషయమై మాట్లాడారు. పెద్ద మనుషుల సమక్షంలో వారు చేసిన నిర్ణయాన్ని తాము ఒప్పుకున్నా.. తమ బాబాయి ఒప్పుకోవడం లేదని చెప్పడంతో ఎస్సై తనను దుర్భాషలాడుతూ, కొట్టారని ఆవుల వెంకన్న పేర్కొన్నాడు. గాయాలు కావడంతో తన తమ్ముళ్లు తనను ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారని తెలిపాడు. ఈ విషయంపై ఎస్పీకి ఫిర్యాదు చేస్తానని బాధితుడు సన్నిహితులతో చెప్పినట్లు సమాచారం. ఈ ఘటనపై చండూరు సీఐ ఆదిరెడ్డిని వివరణ కోరగా భూసమస్యపై వచ్చిన ఫిర్యాదు మేరకు ఇప్పటికే ఇరుపక్షాలను పిలిచి కూర్చొని మాట్లాడుకోవాల్సిందిగా సూచించామని, స్టేషన్‌కు పిలిపిస్తే ఆవుల వెంకన్న ఎస్సైపైనే దుర్భాషలాడాడని పేర్కొన్నారు. ఆవుల వెంకన్నపై ఎస్సై దాడి చేశాడనేది అవాస్తవమని తెలిపారు. ఎస్సై వెంకన్న వివరణ కోసం ప్రయత్నించినా ఆయన అందుబాటులోకి రాలేదు.



బాధితుడు వెంకన్న

చికిత్స పొందుతూ మహిళ మృతి

సూర్యాపేటటౌన్ : వరకట్న వేధింపులు తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాల ప్రకారం.. చివ్వెంల మండలం మున్యానాయక్‌తండాకు చెందిన దరావత్ రమేష్‌కు అదే గ్రామానికి చెందిన బానోత్ బిందు(20) తో గతేడాది వివాహం జరిగింది. అదనపు కట్నం తీసుకురావాలని బిందు భర్త, అత్తమామలు వేధిస్తుండడంతో ఈ నెల 20న సూర్యాపేట పట్టణంలోని ఖమ్మం రోడ్ లోని పెట్రోల్ బంక్ వెనుక పురుగుల మందు తాగి రోడ్డు పై వెళ్తుండగా కింద పడిపోయింది. గమనించిన స్థానికులు సూర్యాపేట ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 25న మృతి చెందింది. మృతురాలి తల్లి సాలమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు బిందు భర్త, ఆమె అత్తమామలపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ ప్రసన్న కుమార్ తెలిపారు.

ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా?

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్: బీఆర్‌ఎస్ కార్యకర్తలు అధికార పార్టీ నాయకులను సోషల్ మీడియాలో ప్రశ్నిస్తే అరెస్ట్ చేస్తారా అని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిరేకల్ పోలీసులు కాంగ్రెస్ ఏజెంట్లలా పనిచేస్తున్నారని ఆరోపించారు. మంగళపల్లి గ్రామానికి చెందిన నాగేంద్ర బాబు అనే బీఆర్‌ఎస్ కార్యకర్త గ్రామానికి చెందిన వాట్సాప్ గ్రూప్‌లో 'సచ్చినప్పుడు రూ.10 వేలు సాయం చేసేటోడు రాజకీయ బిచ్చగాడు...' అని పోస్ట్ చేసినందుకు అతడిని అరెస్టు చేయడంపై శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య స్టేషన్‌కు చేరుకున్నారు. సదరు నాగేంద్రబాబును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించడంపై, బీఆర్‌ఎస్ నేతలపై పోలీసులు దురుసుగా ప్రవర్తించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐ రాజశేఖర్‌తో వాగ్వాదానికి దిగారు. అనంతరం చిరుమర్తి లింగయ్య విలేకరులతో మాట్లాడారు. సోషల్ మీడియాలో చురుకుగా ఉంటున్న బీఆర్‌ఎస్ కార్యకర్త నాగేంద్రబాబును రెండవసారి పోలీస్ స్టేషన్‌కు పిలిపించారన్నారు. సీఐ రాజశేఖర్ అత్యుత్సాహం ప్రదర్శిస్తూ బీఆర్‌ఎస్ కార్యకర్తలను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ నాయకులను టార్గెట్ చేసి పోలీసులు చట్టాన్ని అతిక్రమిస్తున్నారని, దీనిపై తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. నాగేంద్రబాబుపై బెదిరింపులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని అతడికి రక్షణ కల్పించాలని జిల్లా పోలీస్ శాఖను కోరారు. చిరుమర్తి లింగయ్య వెంట బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ చెరుకు సుధాకర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, కట్టంగూర్ మాజీ జెడ్పీటీసీ తలారి బలరాం, నాయకులు గోర్ల వీరయ్య, సామ శ్రీనివాస్‌రెడ్డి, పల్లె విజయ్, గుర్రం గణేష్, యానాల లింగారెడ్డి తదితరులున్నారు.



నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ రాజశేఖర్‌ను ప్రశ్నిస్తున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే లింగయ్య

ఫిర్యాదు మేరకే అదుపులోకి తీసుకుని విచారించాం

ఈఘటనపై సీఐ రాజశేఖర్ స్పందించారు. మంగళపల్లి గ్రామానికి చెందిన నాగేంద్రబాబు అనే యువకుడు స్థానిక వాట్సాప్ గ్రూప్‌లో చేసిన పోస్టుపై గ్రామానికి చెందిన కొందరు తమ మనోభావాలు దెబ్బతీశాడని ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ మేరకు నాగేంద్రబాబును పోలీస్ స్టేషన్ తీసుకువచ్చి విచారించామని చెప్పారు. ఇలాంటి పోస్టులు పెట్టొద్దని కౌన్సిలింగ్ ఇచ్చామే తప్ప అతనిపై ఎలాంటి కేసులు పెట్టలేదని తెలిపారు.

రెండు కార్లు ఢీ..

- ఏఎస్సైతోపాటు పలువురికి గాయాలు

యాదగిరిగుట్ట రూరల్: రెండు కార్లు ఢీ కొనడంతో రాజాపేట ఏఎస్సైతోపాటు పలువురికి గాయాలైన సంఘటన యాదగిరిగుట్ట- తుర్కపల్లి ప్రధాన రహదారిలో మల్లాపురం గ్రామ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపేట ఏఎస్సై ప్రభాకర్, తుర్కపల్లికి చెందిన సోమొల్ల వెంకటేష్, బండారి యాదగిరి, బోడ నవీన్ కుమార్ కారులో యాదగిరిగుట్ట నుంచి తుర్కపల్లి మండలానికి వస్తున్నారు. ఈ క్రమంలో మల్లాపురం పరిధిలోని సైదాపురం కమాన్ వద్దకు రాగానే అదే రూట్లో ఎదురుగా మరో కారు వస్తుండగా ఈ రెండు కార్లు ఒకదానికొకటి బలంగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఏఎస్సై ప్రభాకర్, వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.



ధ్వంసమైన కార్ల ముందు భాగం

యువకుడి హత్యకేసులో ముగ్గురి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన సీఐ రాజశేఖర్

నకిరేకల్: నకిరేకల్ మండలం నోముల గ్రామంలో ఓ యువకుడిని నిర్బంధించి కొట్టి చంపిన కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ రాజశేఖర్ కేసు వివరాలు వెల్లడించారు. నోముల గ్రామంలో నర్సింగ్ జానయ్య(35) అలియాస్ రుబీ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన వివాహిత ధనలక్ష్మితో వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్నాడు. సదరు మహిళ గతంలో కూడా జానయ్యపై పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టడంతో రెండు సార్లు అతను జైలుకు వెళ్లివచ్చాడు. జైలు నుంచి వచ్చాక కూడా ధనలక్ష్మిని వేధించసాగాడు. ఈవిషయంలో ధనలక్ష్మి ఆమె భర్త నాగరాజు మధ్య గొడవలు జరుగుతున్నాయి. కుటుంబంలో జరుగుతున్న వివాదాలకు కారణమైన జానయ్యను ఎలాగైనా చంపాలని పథకం వేశారు. అందులో భాగంగానే జానయ్యను ఈనెల 20న తమ ఇంటికి పిలిపించారు. ఇంటి వెనుక నుంచి జానయ్య ఇంట్లోకి రాగానే ధనలక్ష్మి ఆమె భర్త నాగరాజు ఇద్దరూ కలిసి అతడిని పట్టుకున్నారు. వారి కుమార్తె దివ్య జానయ్య కళ్లలో కారం చల్లింది. అతడిని తీసుకెళ్లి వారి ఇంటి ముందు ఉన్న చెట్టుకు తాడుతో కట్టివేసి కొట్టారు. చుట్టుపక్కల వారి సమాచారం మేరకు జానయ్య కుటుంబీకులు అక్కడకు చేరుకుని అంబులెన్స్‌లో నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందాడు. జానయ్య తల్లి ప్రమీలా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేసినట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు. నిందితుల కోసం గాలించగా.. శుక్రవారం నకిరేకల్‌లోని తాటికల్ ఫ్లైఓవర్ వంతెన వద్ద నల్లగొండకు వెళ్తున్నారన్న సమాచారం మేరకు వారిని పట్టుకుని అరెస్టు చేశామని చెప్పారు. నిందితులుగా ఉన్న చవ్వ ధనలక్ష్మి, ఆమె భర్త నాగరాజు, కుమార్తె దివ్యలను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. ఈ కేసును ఛేదించడంలో సహకరించిన ఎస్‌ఐ లచ్చిరెడ్డి, కృష్ణాచారి, పోలీస్ సిబ్బంది శ్రీనివాస్, సురేష్, జనార్దన్, మధుకర్, వెంకటేశ్వర్లును ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించినట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్, చిత్రంలో ఎస్సైలు లచ్చిరెడ్డి, కృష్ణాచారి

విరాళాల సేకరణకు ఎల్ఈడీ స్క్రీన్

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులకు ప్రతి రోజు (ఆదివారం నుంచి శుక్రవారం వరకు) పులిహోర ప్రసాదం, ప్రతి శనివారం లడ్డూ ప్రసాదం అందజేసే కార్యక్రమాన్ని ఇటీవల ఆలయ ఈఓ వెంకట్రావు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో దాతల నుంచి విరాళాలు సేకరించేందుకు దక్షిణ ద్వారం గుండా భక్తులు బయటకు వెళ్లే మార్గంలో ప్రాకార మండపానికి ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఉచిత ప్రసాదం కోసం విరాళం చేయాలనుకునే భక్తులంతా డోనర్ సెల్‌లో నగదును సమర్పించాలని తెలుపుతూ స్క్రీన్‌లో ప్లే చేస్తున్నారు. ఆన్‌లైన్ పేమెంట్ చేసేందుకు క్యూఆర్ కోడ్ పొందుపరిచారు.

మొదటి ఘాట్ రోడ్డులో సెంట్రీ పోస్టు గది నిర్మాణం

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ మొదటి ఘాట్ రోడ్డులో సెంట్రీ పోస్టు గది నిర్మిస్తున్నారు. కొండపైకి ప్రైవేట్ వాహనాలు మొదటి ఘాట్ రోడ్డు నుంచి రాంగ్ రూట్‌లో వెళ్లకుండా ఉండేందుకు ఒక హోంగార్డుతో పాటు ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది కోసం వేసిన తడకల పందిరి కూలిపోతుండడంతో ఎస్‌పీఎఫ్ ఆర్ఐ శేషగిరిరావు ఈఓ వెంకట్రావ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన మొదటి ఘాట్ రోడ్డు ఎంట్రెన్స్‌లో సెంట్రీ పోస్టు గది నిర్మాణం చేపట్టారు.

యాదగిరి క్షేత్రంలో ఆధ్యాత్మిక శ్లోకాలు



ఆధ్యాత్మిక శ్లోకాల బోర్డులు పరిశీలిస్తున్న ఆలయ ఈఓ

యాదగిరిగుట్ట: యాదగిరి క్షేత్రంలోని ఆలయ పరిసరాలు, ఆధ్యాత్మిక వాడ, ఘాట్ రోడ్డులో ఏర్పాటు చేయనున్న ఆధ్యాత్మిక శ్లోకాలు, సూచనల బోర్డులను శుక్రవారం ఈఓ వెంకట్రావ్ పరిశీలించారు. ఆయన వెంట డీఈఓ భాస్కర్‌రావు, ఆలయాధికారులు దయాకర్‌రెడ్డి, రఘు ఉన్నారు.

పశువులను తరలిస్తున్న వాహనం పట్టివేత

చౌటుప్పల్ : అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని శుక్రవారం రాత్రి చౌటుప్పల్‌లోని వలిగొండ క్రాస్‌రోడ్డు వద్ద పోలీసులు పట్టుకున్నారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన డీసీఎం డ్రైవర్ మహ్మద్ జాహుల్(40), ఏపీలోని శ్రీకాకులం జిల్లా జాలమూరు మండలం జానీ గ్రామానికి చెందిన కొత్త రాజారావు(50), అబ్బాయిపేటకు చెందిన ఉప్పాడ ధర్మారావు(48) కలిసి శ్రీకాకులం జిల్లా నర్సంపేట సంతలో 50 ఆవులతోపాటుగా కొన్ని ఎద్దులను కొనుగోలు చేశారు. వాటిని వాహనంలో హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. వలిగొండ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు సదరు వాహనాన్ని గుర్తించి పట్టుకున్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. పశువులను రాజాపేట మండలం చల్లూరు గ్రామంలోని గోశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.



పట్టుబడిన పశువుల వాహనం

పంచలోహ విగ్రహాల పేరుతో టోకరా

- నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

హుజూర్‌నగర్ : పంచలోహ విగ్రహాల పేరుతో విక్రయించి అమాయకులను మోసం చేస్తున్న ముఠా సభ్యులను హుజూర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ చరమందరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా దుర్గి మండలం అడిగోప్పల గ్రామానికి చెందిన చల్ల పెద్దిరాజు, బత్తుల శ్రీను ఇరువురు కలిసి తమ వద్ద పంచలోహ వినాయకుడి విగ్రహం ఉందని, అది ఇంట్లో పెట్టుకుంటే అంతా మంచి జరుగుతుందని అమాయకులను నమ్మబలికారు. ఈనేపథ్యంలో కోదాడ ప్రాంతానికి చెందిన ఉప్పుతల వినయ్, మద్దెల రజినికుమార్‌లతో కలిసి ఒక పథకం రచించారు. హుజూర్‌నగర్ లోని రామసామిగట్టులో నివాసం ఉండే సయ్యద్ మదార్‌కు విగ్రహం విషయం చెప్పారు. అతను విగ్రహం కొనడానికి ఒప్పుకోగా ఈ నలుగురు కలిసి గురువారం మదార్ ఇంటికి వెళ్లి డబ్బులు అడిగారు. మొదటగా రూ.వేయి ఇవ్వడంతో విగ్రహం చూపించారు. అది ఇత్తడిదని మదార్ గ్రహించడంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో మదార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితులు స్థానిక బస్టాండ్‌లో పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.వేయి నగదు, 5 సెల్‌ఫోన్లు, ఇత్తడి విగ్రహాన్ని స్వాధీనం చేసుకుని వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

నారుమడిలో సరైన జాగ్రత్తలు పాటించాలి

- కంపాసాగర్ కేవీకే సేద్యపు విభాగం శాస్త్రవేత్త చంద్రశేఖర్



చంద్రశేఖర్, శాస్త్రవేత్త, కేవీకే, కంపాసాగర్

త్రిపురారం: ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులు దుక్కులు దున్నుకుంటూ, నారు మళ్లు పోసుకుంటూ ఉన్నారు. నారుమడుల తయారీ, నారు పెంపకంలో సరైన జాగ్రత్తలు పాటిస్తే నాణ్యమైన నారు సిద్ధమవుతుందని కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) సేద్యపు విభాగం శాస్త్రవేత్త చంద్రశేఖర్ చెబుతున్నారు. నారుమడి తయారీలో సలహాలు, సూచనలు ఆయన మాటల్లో..

- నారుమడిని 10 నుంచి 12 రోజుల వ్యవధిలో మూడు దఫాలుగా దమ్ము చేసి చదును చేయాలి. మెట్ట వరినారు పోయాలి అనుకునేవారు నారుమడిని 3 నుంచి 4 సార్లు దుక్కి దున్నుకోవాలి. నీరు పెట్టడానికి తీయడానికి వీలుగా కాలువలు ఏర్పాటు చేసుకోవాలి.
- 5 సెంట్ల నారుమడికి 2కిలోల నత్రజని(కిలో విత్తనం చల్లేముందు, మరో కిలో విత్తిన 12–14 రోజులకు), కిలో భాస్వరం మరియు కిలో పొటాషియం ఉండే ఎరువులను దుక్కిలో వేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భాస్వరం రెట్టింపు వేయాలి.





- మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు 5 కిలోల చొప్పున చల్లుకోవాలి.
- నారు ఒకక ఆకు పురి విప్పుకునే వరకు ఆరు తడులు ఇచ్చి తర్వాత పలుచగా నీరు పెట్టాలి.
- జింకు లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. చలి ఎక్కువగా ఉంటే దాళ్వా వరి సాగులో జింకు లోపాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

నారుమడిలో సస్యరక్షణ చర్యలు

విత్తన పది రోజులకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు సెంటు నారుమడికి 150 నుంచి 160 గ్రాముల చొప్పున వేసుకోవాలి. క్లోరీపైరిపాస్ 2.0 మి.లీ. లేదా మోనోక్రోటోపాస్ 1.6 మి.లీ. విత్తన పదిరోజులకు లేదా 18 రోజులకు శాస్త్రవేత్తల సూచనల ఆధారంగా పిచికారీ చేసుకోవాలి. నారు తీయడానికి 7 రోజుల ముందు సెంటు నారుమడికి కార్బోఫ్యూరాన్ గుళికలు మడిలో పలుచగా నీళ్లు ఉంచి ఇసుకలో కలిపి చల్లుకోవాలి. మడిలో నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచకుండా జాగ్రత్తలు పాటించడం ఉత్తమమైన పద్ధతి.

ట్రేలలో నారు పెంపకం

నాట్లు వేయడానికి కూలీల కొరత ఉండడంతో పలు ప్రాంతాల్లో రైతులు నాటు వేసే యంత్రాలను ఉపయోగిస్తున్నారు. దీంతో నాటు వేసే యంత్రాలకు నారును ప్రత్యేకంగా పెంచాల్సి ఉంటుంది. ఇందు కోసం రైతులు ముందుగానే నాటు యంత్రంలో నారు పేర్చడానికి వీలుగా ఉండేలా ట్రేలను ఏర్పాటు చేసుకోవాలి. తర్వాత పొలంలో ఒక్క మడిలో నీరు బయటకు వెళ్లేలా సిద్ధం చేసుకుని ట్రేలను వరుసలో పేర్చుకోవాలి. వరుసలో ఉన్న ట్రేలలో మొత్తటి మట్టిని నింపుకొని వరి విత్తనలు చల్లుకోవాలి. తర్వాత సాధారణ నారుమడి వలే ఎరువులు అందివాల్సి ఉంటుంది. నాటు వేసే యంత్రానికి నారు ముదరకుండా చూసుకోవాలి.

శ్రీ వరి నాటు యాజమాన్యం ప్రత్యేకం

శ్రీ వరి నారును 9 నుంచి 13 రోజుల వ్యవధిలో నాటుకోవాలి కాబట్టి నారు పెంపకంలో తప్పనిసరిగా మెళకువలు పాటించాలి. రెండు కిలోల విత్తనాన్ని ఒక సెంటు భూమిలో చల్లి నారు పెంచితే ఎకరాకు సరిపోతుంది. భూమిని మొత్తగా దున్ని దుమ్ము చేసి ఎత్తుగా తయారు చేసి చుట్టూ కాలువ తీయాలి. తడి మట్టి జారిపోకుండా నారు చుట్టూ చెక్కతో లేదా బొంగులతో ఊతం ఏర్పాటు చేయాలి. నారుమడి తయారైన తర్వాత చినికిన మొత్తటి పశువుల ఎరువును ఒక పొరలా చల్లి దానిమీద 24 గంటలు నానబెట్టి, 24 గంటలు మండె కట్టి మొలకెత్తిన విత్తనాన్ని పలుచగా చల్లుకోవాలి. విత్తనాల పైన మరలా మరోదఫా పశువుల ఎరువు చల్లి గడ్డితో కప్పాలి. మొలకెత్తిన విత్తనాన్ని పలుచగా చల్లాలి. విత్తనాల పైన మరలా పశువుల ఎరువు చల్లి గడ్డితో కప్పాలి. మొలక వచ్చిన వెంటనే గడ్డిని తీసివేయాలి. ప్రతిరోజు నీరు చల్లుతూ ఉంటే 8రోజుల్లో వరి నారు 2 నుంచి 3ఆకులతో ధృడంగా పెరుగుతుంది. నారుమడి నుంచి నారు పీకకుండా మట్టితో సహా పొలంలోకి తీసుకెళ్లి గింజ బురదతో సహా వరుసకు వరుస 25సెం.మీ. మొక్కకు మొక్కకు 25 సెం.మీ. ఎడంగా ముందుగా మార్కర్ సహాయంతో గీతలు గీసుకొని గీతలు కలిసే ప్రాంతంలో ఒక్కొక్క మొక్కను పైపైన నాటుకోవాలి.